క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంలో కుళ్లిన కోడిగుడ్లు



అరకులోయ రూరల్: మండలంలో ఇరగాయి పంచాయతీ వల్లిపనస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో తమ పిల్లలకు కుళ్లిన కోడిగుడ్లు ఇస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విద్యార్థులకు పెట్టేందుకు కుళ్లిన కోడిగుడ్లు ఉడక బెట్టారని, తాము పెట్టకుండా అడ్డుకున్నామని విద్యార్థుల తండ్రులు సుబ్బారావు, రాజ్‌కుమార్, నీలకంఠం,బాబూరావు తెలిపారు. ఒక గుడ్డు లోపల మృతిచెందిన కోడిపిల్ల ఉందని వారు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన ఆహారం పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

కూనవరం: వరదలు తగ్గుముఖం పట్టినందున పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని చినార్కూరు సచివాలయం ప్రత్యేక అధికారి రాయి భాస్కర్ సూచించారు. చినార్కూరు పంచాయతీలో సర్పంచ్ సున్నం అభిరామ్ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరపి లేని వర్షాలు, ఆపై వరదల వల్ల చెత్తా చెదారం పేరుకుపోయి అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, దోమతెరలు వాడాలని సూచించారు. ఈసమావేశంలో ఎంపీపీ పాయం రంగమ్మ, కార్యదర్శి శివమణికంఠ, వీఆర్‌వో ధర్మరాజు, హెల్త్ సిబ్బంది, సచివా లయం సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

చింతూరు: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కుమ్మూరులో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించి, రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎంపిక చేసిన పొలాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సుస్థిర వ్యవసాయం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి సాగుచేసే రైతులు వచ్చే నెల 15 లోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. విత్తన రకం, భూమిసర్వే నంబర్లు, పట్టా వివరాలు, ఆధార్ నంబరు, ఫోన్ నంబరు, బ్యాంక్‌ఖాతా చూపించి ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు.

విధిగా ఈ క్రాప్ నమోదు

చింతపల్లి: ప్రతి రైతు విధిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు,డీటీ రాజ్ కుమార్ తెలిపారు. ఈ క్రాప్ నమోదుపై వ్యవసాయ సహాయకులు,వీఆర్‌వోలకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేసుకుంటే వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలకు అర్హులవుతారని చెప్పారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి సంయుక్తంగా ఈ క్రాప్‌ను నమోదు చేయాలని వారు వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. వచ్చేనెల 15 నాటికి దీనిని పూర్తి చేయాలన్నారు. పంటల నమోదు అనంతరం రైతులకు ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని తెలిపారు.



కుమ్మూరులో వరినాట్లు వేసే విధానాన్ని రైతులకు చూపిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

270 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అరకులోయ రూరల్: పేద ప్రజలకు వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 270 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 50 మెడికల్ క్యాంపులు నిర్వహించి, 6,640 మందికి ఇప్పటివరకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఈపరీక్షల్లో క్యాన్సర్ నిర్ధారణ అయితే చికిత్సకు ట్రస్ట్ సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణారావు, వైద్యులు మణికంఠ నాగమణి,గౌతం, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాము, విశ్రాంతి జిల్లా వైద్యాధికారి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న రవీంద్రనాథ్ రెడ్డి

వరద బాధితులకు నిత్యావసరాల కిట్ల పంపిణీ

వీఆర్‌పురం(చింతూరు): వీఆర్‌పురం మండలంలోని చొక్కనపల్లికి చెందిన వరద బాధితులకు గూంజ్‌సంస్థ సహకారంతో ఏఎస్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 184 మందికి సంస్థ ప్రతినిధి తిరుపతిరావు, కో ఆర్డినేటర్ జ్యోతి, సౌజన్య, రవి, రాజు ఈ కిట్లను అందజేశారు.



బాధితులకు కిట్లను అందచేస్తున్న సంస్థ ప్రతినిధులు

పీవో చొరవతో జాముగుడకు విద్యుత్ సౌకర్యం



విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ భాస్కరరావు

అరకులోయ రూరల్: ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక చొరవతో మండలంలోని బొండం పంచాయతీ జాముగుడ పీటీజీ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కలిగినట్లు సర్పంచ్ దురియా భాస్కరరావు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది గురువారం జాముగుడ, రేగా గ్రామాల్లో 27 చొప్పున విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని, పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా మారిన విద్యుత్ స్తంభాల స్థానంలో మరో 70 నూతన స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పీవోకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన చట్టాలను పక్కాగా అమలు చేయాలి

రంపచోడవరం: గిరిజన చట్టాలను పక్కాగా అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని... పోరాట దినంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం రంపచోడవరంలో జరిపారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ఆదివాసీలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు పల్లా లచ్చిరెడ్డి మాట్లాడుతూ గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరి పంట నీటి మునిగి నష్టం జరిగిందని, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని,గిరిజనుల ఆధీనంలో ఉన్న పోడుభూములకు పట్టాలు మంజూరు చే యాలని కోరారు. ఈకార్యక్రమంలో పి.అనసూయ, కత్తుల బాలురెడ్డి, బాలుదొర పాల్గొన్నారు.



రంపచోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

కస్తూర్బా విద్యార్థినులకు వైద్య పరీక్షలు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు పంచాయతీ తోటకూరపాలెం కస్తూర్బా విద్యాలయంలో గురువారం 96 మంది విద్యార్థినులకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. రక్తహీనత ఉన్న బాలికలను గుర్తించి, వారు తీసుకోవలసిన పౌష్టికాహారం, వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ దినేష్, విద్యాలయం ప్రిన్సిపాల్ కె.వి.వి.లక్ష్మి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి నరేంద్ర

సీసీ రోడ్ల నాణ్యత తనిఖీ

రాజవొమ్మంగి : మండలంలో పంచాయతీల వారీగా గత రెండేళ్లలో నిర్మించిన సీసీరోడ్ల (వీధిరోడ్లు, డ్రైనేజీలు) నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీకంట్రోల్ (రాజమహేంద్రవరం) పీఆర్ డీఈ టి.సురేష్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంపిల్స్ తీసి తమ కార్యాలయంలోని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు.అనంతరం ఐటీడీఏ పీవో, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. రంపచోడవరం డివిజన్‌లో సుమారు 465 సీసీ రోడ్ల నిర్మించారని చెప్పారు. రాజవొమ్మంగి మండలంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 6.1 కోట్ల విలువైన 192 పనులు నామినేటెడ్ పద్ధతిలో జరిగాయన్నారు. వీటి నాణ్యతాప్రమాణాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట ఏఈలు రాజుబాబు, నాగేంద్రకుమార్, రవితేజ సిబ్బంది ఉన్నారు.



రాజవొమ్మంగి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు శాంపిళ్లను తీస్తున్న డీఈ సురేష్‌కుమార్



ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



వై.రామవరంలో సమావేశమైన ఆదివాసీ పెద్దలు, నిర్వహణ కమిటీ అధికారులు

వై.రామవరం: మండల కేంద్రం వై.రామవరంలో శుక్రవారం నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఏడు తెగల ఆదివాసీలు హాజరై విజయవంతం చేయాలని ఈ దినోత్సవ నిర్వహణ కమిటీ అధికారులు కోరారు. ఈసందర్భంగా నిర్వహణ కమిటీ అధికారులు ఎంపీడీవో కె.బాపన్నదొర, డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, ఎంఈవో కె.తాతబ్బాయి దొర గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల ఆదివాసీ చైతన్య సంక్షేమ సంఘం పెద్దలతో సమావేశమై, వేడుకల నిర్వహణపై చర్చించారు.

స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి నిర్ణయించారు. అనంతరం వేడుకల నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు. ఈసమావేశంలో పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు, ఆదివాసీ పెద్దలు కడబాల ఆనందరావు, పల్లాల తమ్మిరెడ్డి, పల్లాల అబ్బాయిరెడ్డి, లండా రాజబాబు, పల్లాల లక్ష్మణరెడ్డి, పల్లాల లింగారెడ్డి, గొర్లె శ్రీకాంత్, పల్లాల వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో నిర్వహించాలి

గంగవరం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదిక కన్వీనర్, వైఎస్సార్ సీపీ నాయకుడు పండా సిద్ధార్థ దొర పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ఆదివాసీ జెండాలు ఎగురవేయాలన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న సదస్సులో తాను పాల్గొనున్నట్టు తెలిపారు.

ఘనంగా ముందస్తు వేడుకలు



ఆదివాసీ దినోత్సవ ముందస్తు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ నాయకులు

చింతూరు: మండలంలోని కాటుకపల్లి లిట్స్ సంస్థలో గురువారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలు, హక్కులను కాపాడేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. చుటుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడమ అర్జున్, సర్పంచ్‌లు సవలం సత్తిబాబు, పాయం చంద్రయ్య, లిట్స్‌సంస్థ డైరెక్టర్ ఏసురత్నం, కో ఆర్డినేటర్ ధన పాల్గొన్నారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

గంగవరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కళాశాల ఆవరణలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సత్య సులోచన తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆదివాసీ నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు, ఎంఆర్ఐ జిలానీ, మండల పరిషత్ పర్యవేక్షకుడు సిద్ధేశ్వరరావు, ఆదివాసీ నాయకులు తీగల ప్రభ, సిద్ధు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు సులోచన

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

కొయ్యూరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లో శుక్రవారం మొక్కలు నాటనున్నట్టు ఎంపీడీవో సీతయ్య తెలిపారు. ప్రతి కార్యదర్శి ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. నాటిన మొక్కలు ఫొటోలను విధిగా పంపాలని, వాటిని పీవోకు అందజేస్తామని చెప్పారు.